ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
గురువారం 19 జూన్ 2025





ఆకాశంలో అద్భుతం

సూర్యుడి చుట్టూ వలయం

ఆకాశంలో అద్భుతం చోటు చేసుకుంది. బుధవారం సూర్యుడి చుట్టు ఇంద్రధనస్సులా ఓ వలయం ఏర్పడింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంతో పాటు పలు ప్రాంతాల్లో సూర్యుడి చుట్టూ వలయం స్పష్టంగా కనిపించింది. ఈ దృశ్యం ప్రజలను ఆకట్టుకుంది. పలువురు తమ మొబైల్ ఫోన్లలో బంధించారు. - బెల్లంపల్లి

అన్నదాతల్లో ఆనందం

- రైతు భరోసాపై మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్
- రైతుల ఖాతాల్లో నగదు జమచేసిన సర్కారు
- జిల్లాలో లక్షా 72 వేల మంది రైతులకు లబ్ధి
- మూడెకరాలున్న వారికి పెట్టుబడి సాయం



మంచిర్యాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంట పెట్టుబడి సాయం అందజేస్తామన్న తెలంగాణ ప్రభుత్వం ఎట్టకేలకు తన హామీని నిలబెట్టుకుంది. వానాకాలం సాగు సమయానికి అనుకున్న ప్రకారం రైతు భరోసా నగదును రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. మూడెకరాల వరకు భూమి ఉన్న రైతులకు రైతు భరోసా కల్పిస్తుండగా, ఆ మేరకు అవసరమైన నిధులను విడదల చేసింది. మిగిలిన రైతులందరికీ రాబోయే తొమ్మిదిరోజుల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మలనాగేశ్వర్‌రావు ప్రకటించారు. ఈ సంవత్సరం వర్షాకాలం ముందస్తుగా ప్రారంభం కావడంతో రైతులు ఇప్పటికే వానాకాలం సాగు పనులు ప్రారంభించారు. దుక్కు లు దున్ని పత్తి విత్తనాలు కొనుగోలు చేయడం తోపాటు వరినాట్లు కూడా వేస్తున్నారు. సకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందజేస్తుండటంతో ట్రాక్టర్ల కిరా యిలు, విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లు, కూలీల ఖర్చుకు ఉపయోగపడతాయనే భావనలో రైతులు ఉన్నారు. జూన్‌లోనే వానాకాలం పంట పెట్టుబడి సాయం అందడం ఇదే మొదటిసారి కావడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● 1.71 లక్షల రైతులకు లబ్ధి....

ప్రభుత్వ నిర్ణయం మేరకు రైతు భరోసా పథకానికి జిల్లాలో 1,71,307 మంది రైతులు అర్హత కలిగి ఉన్నట్లు బ్యాంకర్ల సమాచారం మేరకు ప్రభుత్వం గుర్తించింది. వారికి నగదు జమ చేసేందుకు 205 కోట్ల 11 లక్షల ఆరు వేల 234 రూపాయలు అవసరం అవుతాయని గుర్తించారు. వానాకాలం కోసం జిల్లాలో వివిధ రకాల పంటలు 3.18 లక్షల ఎకరాల్లో సాగవుతాయని అధికారులు ప్రణాళిక రూపొందించారు. కాగా జిల్లా వ్యాప్తంగా వానాకాలం సాగుకు సంబంధించి రైతు భరోసా కింద బుధవారం వరకు లక్షా 13వేల 886 మంది రైతులకు లబ్ధి చేకూరగా, రూ. 86 కోట్ల 42 లక్షల 50వేల 138 రూపాయలు బ్యాంకు అకౌంట్లలో నగదు జమ అయింది.

● మండలాల వారీగా రైతులకు చెల్లించిన నగదు..

రైతు భరోసా పథకం కింద వానాకాలం సాగు కోసం జిల్లాలో మొత్తం అర్హులైన రైతులను 1, 71, 307 మందిని ఎంపిక చేయగా, రూ. 205 కోట్ల 11 లోల 6వేల 234 నగదు...

మిగతా 7లో

శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలి

బెల్లంపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోచమ్మగుడి వద్ద ఉన్న శ్మశానవాటికలో సంబంధిత అధికారులు సౌకర్యాలు కల్పించాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ అన్నారు. బుధవారం ఎంసీపీఐయూ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శ్మశానవాటికలో సరైన వసతులులేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నో ఏళ్లుగా పోచమ్మగుడి వద్ద ఉన్న శ్మశానవాటిక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోందన్నారు. బోరు వేసినప్పటికీ మరమ్మతులు చేయకపోవడంతో వృథాగా ఉంటుందని పేర్కొన్నారు. నీటివసతి లేక శ్మశాన వాటికకు వచ్చిన వారు పోచమ్మ చెరువు దగ్గర ప్రమాదకరంగా స్నానం చేయాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రమేశ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్ వాడీ కేంద్రంలో యోగాపై అవగాహన

నస్పూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విలేజ్ నస్పూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్స్ చుట్టు పక్కల వారికి యోగాసనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయుష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో యోగా, ధ్యానం, ప్రాణయామం తదితర ఆసనాలపై అంగన్ వాడీ కేంద్రంలో మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పద్మజ, యోగ శిక్షకులు సుధాకర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి భూ సమస్యను పరిష్కరిస్తాం

● బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో హరికృష్ణ

భీమిని, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగళ్లపల్లిలో ఏళ్ల తరబడి నెలకొని ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తామని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ అన్నారు. గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులు అధికారులకు సమస్యను విన్నవించుకోగా వారు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఆర్డీవో గ్రామస్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గ్రామ శివారులోని 603 ల్లో సాగులో ఉన్నప్పటికి పట్టాలు ఇవ్వడం లేదని రైతులు పేర్కొన్నారు. పట్టాలు లేక పోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పంట రుణాలు అందడం లేదన్నారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆర్డీవో సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి అర్హులైన వారందరికీ పట్టాలు అందజేస్తామని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులకు డబ్బులు ముట్టాయని వస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. సాదాబైనామాల కోసం చలానాలు కట్టుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు అన్ని పత్రాలు జత చేస్తే సమస్య పరిష్కరించడం సులువు అవుతుందన్నారు. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులు, వాటి వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బికర్ణదాస్, డిప్యూటీ తహసీల్దార్ గోవర్ధన్, ఆర్‌ఐ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కాసిపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి

కాసిపేట,జూన్18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి అన్నారు. బుధవారం కాసిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసే దిశగా సమర్థవంతంగా పని చేస్తోందన్నారు. ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీతో పాటు రైతు భరోసా అందిస్తోందన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. మొట్టమొదటిసారి కాసిపేటకు వచ్చిన శివచరణ్ రెడ్డిని స్థానిక కాంగ్రెస్ నాయకులు శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రత్నం ప్రదీప్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్‌వాల్మీకి, బామన్ల రాకేశ్, విష్ణు, తాటిపాముల సాయికిరణ్ పాల్గొన్నారు.

పాఠశాల గేటుకు తాళం వేసి.. పురుగుల మందు డబ్బాతో నిరసన

- వెల్గనూర్‌లో ఏఎంసీ మాజీ చైర్మన్ దంపతుల బైఠాయింపు
- అభివృద్ధి పనుల బకాయి బిల్లులు చెల్లించాలని డిమాండ్

7

పెన్షన్‌తోనే సామాజిక భద్రత: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పెన్షన్‌తోనే సామాజిక భద్రత కలుగుతుందని, రోజువారీ కనీస అవసరాలను తీర్చేందుకు సామాజిక భద్రత పథకం అమలు చేస్తున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన చేయూత పెన్షన్లపై అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని వృద్ధులు, దివ్యాంగులు, ఎయిడ్స్ బాధితులు, డయాలసిస్, ఫైలేరియా రోగులు, వితంతువులు, దివ్యాంగ నేత కార్మికులు, కల్లుగీత కార్మికులను రక్షించేందుకు కష్టతరమైన జీవితాన్ని గడుపుతున్న బీడీ కార్మికులు, ఒంటరి మహిళల అవసరాలు తీర్చేందుకు ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. అర్హులైన పెన్షన్ లబ్ధిదారుల వివరాలను పోర్టల్‌లో స్పష్టంగా నమోదు చేయాలన్నారు. పెన్షన్ పంపిణీలో ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. రేషన్ కార్డు దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. మున్సిపల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని పన్నులను వంద శాతం వసూలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక భద్రత పెన్షన్ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సెర్ప్ సంచాలకులు గోపాల్‌రావు, డీఆర్‌డీవో కిషన్, డీపీవో వెంకటేశ్వర్‌రావు, జడ్పీ సీఈవో గణపతి, అధికారులు పాల్గొన్నారు.

ప్రవేశాలకు ఎంపిక పోటీలు



తంగళ్లపల్లిలో ఎంపిక పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తాండూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : క్రీడాపాఠశాలల్లో నాలుగోతరగతిలో ప్రవేశాల కోసం బుధవారం మండలంలోని తంగళ్లపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ఎంపిక పోటీలను నిర్వహించినట్లు ఎంఈవో మల్లేశం తెలిపారు. అమ్మాయిల విభాగంలో ఏడుగురు, బాలుర విభాగంలో 10మంది జిల్లా స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు శ్రీనివాస్, ఉమాదేవి, పీడీలు సాంబమూర్తి, సంతోష్‌కుమార్, పీఈటీ స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ముగ్గురు ఎంపిక

నెన్నెల : హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం బుధవారం నెన్నెలలో మండల స్థాయి సెలక్షన్లు నిర్వహించారు. మేకల అక్షర శ్రీసాయి (చిన్నవెంకటాపూర్), సూర్య మనోభిరామ్ (కోనంపేట), రిషివర్ధన్ (నెన్నెల)లు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు రాజేష్, శ్రీనివాస్, రమేష్, రాజేశ్వరీలు అభినందించారు.

విద్యార్థులకు ఎంపిక పోటీలు

జైపూర్ : 2025-26 విద్యా సంవత్సరానికి గాను హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లలోని క్రీడా పాఠశాలల్లో నాలుగో తరగతిలో ప్రవేశాలకోసం బుధవారం జైపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థుల జాబితాను మంచిర్యాల డీవైఎస్‌వోకు పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్, మండల ఇన్‌చార్జీ వ్యాయామ ఉపాధ్యాయుడు గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

● డీఈవో యాదయ్య



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

లక్షెట్టిపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని జిల్లా విద్యాధికారి యాదయ్య సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యపై ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సకల సౌకర్యాలను కల్పిస్తోందని తెలిపారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. బడీడు పిల్లలు ఎవరూ బయట కనపడకుండా చూడాలని పాఠశాలలో చేర్పించాలని సూచించారు. అందుకు గాను పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వం పాఠశాలల్లో కల్పించే వసతులు, పిల్లల భవిశ్యత్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. డీఈవో వెంట క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించకపోతే చర్యలు

దండేపల్లి (ఆంధ్రజ్యోతి): దండేపల్లిలో కస్తూర్బా గాంధీ విద్యార్థినులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని లేని పక్షంలో సిబ్బందిపై చర్యలు తప్పవని డీఈవో యాదయ్య హెచ్చరించారు. బుధవారం దండేపల్లి కర్ణపేట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకసిక్మంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం తీరు, సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. విద్యాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, భోజనం సరిగా పెట్టడం లేదని ఫిర్యాదు చేయడంపై కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. విద్యాలయం బోధన సిబ్బంది సమయపాలన పాటించడంలేదని డీఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం విద్యార్థుల హాజరు పట్టిక, సిబ్బంది రిజిష్టర్లను పరిశీలించారు. వంట సామగ్రిని పరిశీలించి గడువు ముగిసిన సామగ్రి ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంఈవో దుర్గం చిన్నయ్య ఉన్నారు.

మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వివేక్



మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి బుధవారం సచివాలయంలో తనకు కేటాయించిన 21, 22 బ్లాకులో బాధ్యతలుగా స్వీకరించారు. అంతకు ముందు కుటుంబసమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు మంత్రిని ఆశీర్వదించారు. పలు ఫైళ్లపై సంతకాలు చేశారు.

'రైతు భరోసా'కు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా పథకం కోసం అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా వానాకాలం 2025కోసం జూన్ 5, 2025 నాటికి నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసాలో నమోదు చేసుకునేందుకు అర్హులన్నారు. గత సంవత్సరం దరఖాస్తు చేసు కోని రైతులు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఇందుకోసం దరఖాస్తు ఫారం, పట్టా దారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం నకలు ప్రతులతో ఆయా గ్రామాలకు సంబంధించిన వ్యవసాయ విస్తరణ అధికారులను రైతు వేదికలో సంప్రదించి ఈ నెల 20లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

జంగిల్ సఫారికి కొత్త వాహనాలు

హాజీపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏసీసీ క్వారీలోగల జంగిల్ సఫారీలో రెండు అధునాతన సఫారీ వాహనాలను బుధవారం అటవీ శాఖ అధికారులు ప్రారంభించారు. పర్యాటకులకు సురక్షితమైన, రమణీయమైన అనుభవాన్ని అందించేందుకు వీలుగా నూతన సఫారీ వాహనాలు తీసుకొచ్చామని అధికారులు తెలిపారు. ఎలాంటి చప్పుడు లేకుండా నడిచే ఈ వాహనాలు అడవిలోని వన్యప్రాణులను సఫారీ ట్రాక్ ద్వారా దగ్గర నుంచి చూసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పర్యాటకులకు మరింత జాగ్రత్తగా, సౌకర్యవంతంగా ప్రకృతిని ఆస్వాదించవచ్చునని అన్నారు. ఇక నుంచి ఈ సఫారీ మార్గంలో పుట్టిన రోజు వేడుకలు లంచ్ ఏర్పాటు చేసుకు నేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ రహిత విధానంతో వేడుకలు జరుపుకోవాలని తెలిపారు. ఎఫ్‌డీవో సర్వేశ్వర్, ఎఫ్ఆర్‌వో అత్తె సుభాష్, ఎఫ్ఎస్‌వో అతహుల్లా, ఎఫ్‌డీవోలు రాజేందర్, స్వప్నిల్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి ధర్తీ ఆబా జనభాగీదరి అభియాన్ కార్యక్రమం కింద జిల్లాలో మొదటి విడతగా 500 మంది గల గ్రామాలను 50 శాతం గిరిజన జనాభా గల ఏడు మండలాల్లోని 11 గ్రామాలను ఎంపిక చేసి రాబోయే ఐదు సంవత్సరాలకు ప్రణాళిక ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ నెల 19న కాసిపేట మండలం వెంకటాపూర్‌లో, నెన్నెల మండలం జంగల్‌పేట గ్రామపంచాయతీ జంగల్‌పేటలో, 20వ తేదీన కాసిపేట మండలం పల్లంగూడ గ్రామపంచాయతీ పల్లంగూడలో, నెన్నెల మండలంలోని కొత్తూరులో, జన్నారం మండలం ఇందన్‌పల్లి పంచాయతీ కొత్తపేట గ్రామంలో, 21న భీమారం మండలం బూరుగుపల్లి గ్రామంలో, దండేపల్లి మండలం లింగాపూర్‌లో, 23న హాజీపూర్ మండలం గడ్‌పూర్‌లో, నాగారంలో కార్యక్రమాలు ఉంటాయన్నారు. గిరిజన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ఈసెట్ కౌన్సెలింగ్

బెల్లంపల్లి,జూన్18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం టీఎస్ ఈసెట్ 2025 కౌన్సెలింగ్‌ను అధ్యాపకులు నిర్వహించారు. మొత్తం 257 మంది విద్యార్థులకు గానూ 248 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ దేవేందర్ రెడ్డి తెలిపారు. కౌన్సెలింగ్‌కు వచ్చిన విద్యార్థుల సర్టిఫికేట్లను పరిశీలించామని వివరించారు.

నీటి కోసం ఖాళీ బిందెలతో రోడ్డుపై ధర్నా



రోడ్డుపై ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

తాండూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తాండూర్ గ్రామపంచాయతీలోని కొత్తగుడిసెల ఏరియాలో నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఖాళీ బిందెలతో మహిళలు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గత నెల రోజులుగా నీరు రావడం లేదని దీంతో వారం రోజుల క్రితం ధర్నా చేశామని అయినా అధికారులు, ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. మండల ప్రత్యేకాధికారితో పాటు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించామని అయినా తమ నీటి కష్టాలు తీరడం లేదన్నారు. నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అసహనం వ్యక్తం చేశారు. దీంతో విషయం తెలుసుకున్న మండల మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ ధర్నా వద్దకు చేరుకుని ఎలాగైనా మంచినీరు వచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో మహిళలు ధర్నాను విరమించి వెళ్లిపోయారు. కాగా మహిళలు రోడ్డుపై ధర్నా చేయడంతో కొద్దిసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

దాడిఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు

బెల్లంపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భూమి విషయంలో ఒకరిఒకరు దాడి చేసుకున్న ఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు తాళ్లగురిజాల ఎస్ఐ రమేశ్ బుధవారం తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. మండలంలోని ఆకనపల్లి శివారులో గల సర్వే నంబర్ 64లోగల భూమిలో మంగళవారం సాయంత్రం గణేష్ భూమి దున్నుతున్న సమయంలో హైమావతి వారి కుటుంబసభ్యులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అంతేగాకుండా ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోటపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రాణహిత నది నుంచి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు మాటు వేసి పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. కాగా ట్రాక్టర్ డ్రైవర్ పెద్దింటి రాజుతో పాటు వెల్మపల్లి గ్రామానికి చెందిన మానిశెట్టి ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయ పేర్కొన్నారు. ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

కాగజ్‌నగర్ టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని బలగల మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో ఖాళీగా ఉన్న పీసీఈ (ప్లంబర్ కం ఎలక్ట్రీషియన్) పోస్టుకు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ షగుఫ్తా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు సంబంధిత విభాగంలో ఐటీఐ పూర్తి చేసి మైనారిటీ అభ్యర్థులై ఉండాలని పేర్కొన్నారు. రోజు వారీ పద్ధతిన వేతన చెల్లింపు ఉంటుందని, అను భవం కలిగిన వారికి ప్రాధాన్యం ఇస్తామ ని తెలిపారు. హెడ్ కుక్ పోస్టులకు కూడా మైనారిటీ లేదా మైనారిటీయేతర పురుష అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఈ మేరకు ప్రిన్సిపాల్ సూచించారు.



హద్దులు తేలక.. భూ సమస్యలు తీరక

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భూముల సర్వేకు రైతులు దరఖాస్తు చేసి ఏళ్లు గడుస్తున్నా పరిష్కారానికి నోచని పరిస్థితి నెలకొంది. కొలతలు చేసేవారు లేకపోవడంతో సరిహద్దుల సమస్యలు తీరడం లేదు. దీనికితోడు పక్కన ఉండేవారితో తగాదాలు చోటు చేసుకుంటున్నాయి. జిల్లాలో సర్వేయర్ల కొరత వేధిస్తోంది. భూములకు సంబంధించిన దరఖాస్తుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ఏళ్లు గడిచినా సర్వే చేయలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. భూములను అధికారికంగా సర్వే చేయించుకు నేందుకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇప్పుడు మళ్లీ కొత్తగా భూ భారతి చట్టంలో స్కేచ్, మ్యాప్‌లు వేసేలా ముందుకు వెళుతున్నారు. మరోవైపు లైసెన్స్ సర్వేయర్ల కోసం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎంపికైన వారికి శిక్షణ కొనసాగుతోంది. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో దానికి పరిష్కారం దొరికే అవకాశం ఉందని చెబుతున్నారు.

తీరనున్న ఇక్కట్లు..

లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకాలతో సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లాలో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎంపికైన అభ్యర్థులకు గత నెల 26 నుంచి జూలై 26 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ అనంతరం వీరికి మండలాల్లో బాధ్యతలు కేటాయించనున్నారు. మండలానికి ఐదుగురు చొప్పున సర్వేయర్లను కేటాయించనున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

శిక్షణ కొనసాగుతోంది..

సోమేశ్వర్, ఏడీ ల్యాండ్ అండ్ సర్వే

లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ప్రస్తుతం శిక్షణ కొనసాగుతోంది. జూలై 26 వరకు ఈ శిక్షణ ఉంటుంది. శిక్షణ అనంతరం ఆగస్టులో వీరిని ఆయా మండలాలకు కేటాయిస్తాం. దీంతో సరిహద్దు సమస్య తీరనుంది.

పెండింగ్‌లో దరఖాస్తులు..

కుమరంభీం జిల్లాలో భూ సర్వే కోసం వచ్చిన వందలాది దరఖాస్తులు అపరిష్కృతంగా ఉంటున్నాయి. భూ కొలతలకు దరఖాస్తు చేసి ఎదురుచూస్తున్నారు. వీరిలో అత్యధికులు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేశారు. ప్రతి సోమవారం కలెక్టరేట్ నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తులు అందిస్తున్నారు. దరఖాస్తులను సిబ్బంది పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కానీ స్థిరాస్తి వ్యాపారుల భూ సర్వే మాత్రం చకచకా జరిగిపోతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. హద్దులు తేలక గట్టు పంచాయతీలు పెరుగుతున్నాయి. కొలతలు చేపట్టి తమకు హద్దులు చూపాలని రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

జోరుగా స్థిరాస్తి వ్యాపారం..

కుమరంభీం జిల్లాలో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. విలువ పెరిగేకొద్ది సరిహద్దుల వివాదాలు సైతం పెరిగాయి. తమ భూమికి హద్దులు చూపాలంటూ రైతులు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో 15 మండలాలు ఉండగా ఎక్కడ సరిపడా సర్వేయర్లు లేకపోవడం ఇబ్బందిగా మారింది. జిల్లాలో 15 మంది సర్వే యర్లు ఉండాల్సి ఉంది. కానీ కేవలం 8 మంది మాత్రమే ఉన్నారు. దీంతో ఒక్కో సర్వేయర్‌కు అదనంగా మరో మండలం బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ భూముల సర్వే, రహదారుల సర్వే, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రక్రియ తదితర పనులు ఉండడంతో వారు బిజీగా ఉంటున్నారు. దీని వల్ల దరఖాస్తుల వైపు చూడడం లేదు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య



దేవక్క(ఫైల్)

లక్సెట్టిపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట మండలం ఎల్లారం గ్రామానికి చెందిన బిల్ల దేవక్క(59) అనే మహిళ అనారోగ్యం భరించలేక బుధవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవక్క పది సంవత్సరాల నుంచి బీపీ, షుగర్, థైరాయిడ్ సమస్యలతో బాధపడుతోంది. పది నెలల క్రితం క్యాన్సర్ వ్యాధి భారిన పడడంతో కరీంనగర్, హైదరాబాద్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంది. అయినా నయం కాకపోడంతో మనస్తాపానికి గురైంది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు దేవక్క కూతురు దావనపల్లి శ్రీవాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆకతాయిపై కేసు నమోదు

మంచిర్యాలక్రైం,జూన్18(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం కాలేజీరోడ్డులో మెడికల్ కాలేజీ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వెకిలిచేష్టలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు షీటీం ఎస్ఐ హైమా ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఓ చికెన్ సెంటర్‌లో పని చేస్తున్న వ్యక్తి మెడికల్ కాలేజీ విద్యార్థులు రోడ్డుపై వెళ్తుంటే అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనే సమాచారం మేరకు ఈడెకాయి ఆపరేషన్ నిర్వహించి అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వారితో పాటు కానిస్టేబుల్ సతీష్, మహిళ కానిస్టేబుల్ జ్యోతి, శ్రీలత పాల్గొన్నారు.

డ్రైవర్‌పై దాడిచేసిన వారిపై..

మంచిర్యాలక్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బస్సు డ్రైవర్ చిప్పకుర్తి శ్రీనివాస్‌పై దాడి చేసిన కేసులో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఓ ప్రైవేటు పాఠశాల బస్సు హాజీపూర్ నుంచి మంచిర్యాలకు వస్తుండగా ఐబీ చౌరస్తా వద్ద నలుగురు వ్యక్తులు బస్సును అడ్డగించి డ్రైవర్‌పై దాడి చేశారన్నారు. డ్రైవర్ చిప్పకుర్తి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాలేజీరోడ్డుకు చెందిన కరవేణి మనోజ్, ఎన్టీఆర్ నగర్‌కు చెందిన మామిడిపల్లి చందు, కాలేజీ రోడ్డుకు చెందిన ముత్తునూరి విజయ్, మేకల వెంకటసాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అసభ్యకరపోస్టులు పెట్టిన వ్యక్తిపై..

జన్నారం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ఓ అమ్మాయితో నిశ్చితార్థం చేసుకొని రద్దు చేసుకున్న తరువాత అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనూష ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం బుట్టాపూర్ గ్రామానికి చెందిన పోతుగంటి వినయ్ అనే వ్యక్తి మండలానికి చెందిన ఓ అమ్మాయితో గతంలో నిశ్చితార్థం జరిగింది. అనంతరం కొద్ది రోజులకే ఇరువర్గాలు రద్దు చేసుకోవడంతో అమ్మాయితో చనువుగా మెలిలిన ఫొటోలు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసి అమ్మాయికి పెండ్లిసంబంధాలు కుదురకుండా అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేయడంతో పోతుగంటి వినయ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అనూష తెలిపారు.

ప్రజల భద్రతే పోలీసుల లక్ష్యం

ఆసిఫాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రతే పోలీసుల లక్ష్యమని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లు, సబ్ ఇన్‌స్పెక్టర్‌లు, షీ టీం, భరోసా సెంటర్, జిల్లా కళాజాత బృందం, పోలీసు సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. బాల్య వివాహాలు, సైబర్ క్రైమ్, డయల్ 100, సీపీఆర్, భారీ వర్షాలు, వరదలు వల్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ నివేధిత మాదక ద్రవ్యాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యల గురించి పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు ప్రజలకు ఎలాంటి తక్షణ పరిస్థితు ల్లోనైనా సహాయం అందించేందుకు ముందుంటారని చెప్పారు. డయల్ 100 ద్వారా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

మూడు వాహనాలు సీజ్

దహెగాం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తనిఖీల్లో భాగంగా బుధవారం మూడు వాహనాలను ఆర్టీవో రాజమల్లు సీజ్ చేశారు. దహెగాం మండలంలో వాహనాల తనిఖీల్లో సరైన పత్రాలు లేని మూడు వాహనాలు సీజ్ చేసి పోలీసులకు అప్పగించామని తెలిపారు.

మానవ అక్రమ రవాణా ముఠా పట్టివేత

రెండు కేసుల్లో ఆరుగురు నిందితుల అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ రామానుజం

ఆసిఫాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): యువతులకు మా యమాటలు చెప్పి మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠా సభ్యులను కుమరం భీం జిల్లా ఆసిఫాబాద్ జిల్లా పోలీసులు పట్టుకున్నారు. రెండు కేసుల్లో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాం డ్‌కు తరలించారు. బుధవారం రాత్రి ఆసిఫా బాద్ పోలీసు స్టేషన్‌లో కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆసిఫాబాద్ మండలంలోని వాడిగొంది గ్రామానికి చెందిన గిరిజన యువతి ఏడాది క్రితం అదృశ్యమైంది. ఆమె తండ్రి తన కూతురు కోసం గాలిస్తున్నాడు. సదరు యువతి గత నెలలో ఆధార్‌కార్డు అప్‌డేట్ చేసింది. ఆ కార్డు బాధితురాలి ఇంటికి పోస్టులో వచ్చింది. కార్డుపై ఉన్న ఫోన్ నంబరుకు డయల్ చేశారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నంబరుగా తెలియడంతో బాధితురాలి తండ్రి వారం రోజుల క్రితం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయాన్ని తెలుసు కున్న జిల్లా కేంద్రంలోని మరో బాధితురాలు సైతం పోలీసులను కలిసి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకొని పోలీసులు విచారణ చేపట్టారు. ఈ రెండు కేసులలో సంబంధం ఉన్న తొమ్మిది మంది నిందితులను గుర్తించారు. ఇందులో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. మొదటి యువతిని రూ. 1,30,000 లకు, రెండో యువతిని రూ. 1,10,000 లకు విక్రయించారు. కాగా రెండో యువతి అక్కడి నుంచి తప్పించుకుని వచ్చి ప్రస్తుతం జిల్లా కేంద్రంలోనే ఉంటున్నది. కానీ ఇప్పటి వరకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. మధ్యప్రదేశ్ యువతి వ్యవహారం బయటకి రావడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. తొమ్మిది మంది నిందితుల్లో ఐదుగురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. ఇందులో ఏ1గా పరికిపండ్ల విజయలక్ష్మి, ఏ2గా సత్యంశెట్టి సుజాతా, ఏ3గా పంచపూల, ఏ4గా తాడూరి ఉష, ఏ5గా హరిదాస్(సస్పెండ్ అయిన కానిస్టేబుల్), ఏ6గా సుధాకర్‌లను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఏ7 రమేశ్ గౌడ్, ఏ8 సురేఖ, ఏ9 జగదీష్‌లు పరారీలు ఉన్నారని వీరి కోసం ప్రత్యేక బృందం మధ్యప్రదేశ్‌కు వెళ్లినట్లు డీఎస్పీ తెలిపారు. అదుపులోకి తీసుకున్న నిందితుల నుంచి రూ. 50 వేలు, ఆరు మొబైల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వీరిలో హరిదాస్, సురేఖ ఇప్పటికే ఇటువంటి కేసులలో నిందితులుగా ఉన్నారని డీఎస్పీ వివరించారు. బాధిత మహిళలు ఇద్దరు ఎస్టీలు కావడంతో ఎస్సీ, ఎస్టీ కేసులతో పాటు మానవ అక్రమ రవాణా, లైంగిక నేరాల కేసు, అనైతిక నేరాల కేసును నమోదు చేసినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐ బుద్దె రవీందర్, ఎస్సై ప్రశాంత్ పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తే ప్రభుత్వ పథకాలు రద్దు చేయాలి

ఆసిఫాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎవరైనా గంజాయి సాగు చేస్తే వారికి ప్రభుత్వ పథకాలు రద్దు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలో ఎస్పీ కాంతిలాల్ సుభాస్ పాటిల్, జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి మాదకద్రవ్యాల నివారణపై పోలీసు, రెవెన్యూ, సంక్షేమ, విద్య, వైద్య ఆరోగ్య, రవాణా గిరిజన సంక్షేమ, పంచాయతీ రాజ్, వ్యవసాయ అటవీ శాఖల అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగాలు జరగ కుండా అధికారులు సమన్వయంతో వ్యవహరించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా జిల్లాలో గంజాయి సాగు చేయకుం డా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఎవరైనా గంజాయి సాగు చేసినట్లయితే వారిని గుర్తించి వారికి ప్రభుత్వ పరంగా లభించే పథకాల లబ్ధిని రద్దు చేయాలని తెలిపారు. పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాలు, కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్పీ కాంతిలాల్ సుభాష్ పాటిల్ మాట్లాడుతూ వచ్చే రెండు నెలల్లో పోలీసు కళాజాతా బృందం చేత ప్రతీ సోమవారం, గురువారం మాదకద్ర వ్యాల వల్ల కలిగే అనార్థాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను విక్రయించినా, వినియోగించినా వాటిని గుర్తించి వారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని తెలిపారు. నిత్యం తనిఖీలు చేపడుతూ అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ మేరకు సిబ్బందిని అప్రమత్తం చేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా సంక్షేమాధికారి బాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సీతారాం, జిల్లా రవాణాధికారి రాంచందర్, జిల్లా మాధ్యమిక అధికారిణి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో డబ్బులు జమ

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం లో భాగంగా ప్రభుత్వం రైతుభరోసా పథకం కింద జిల్లాలోని 95,975 మంది రైతుల ఖాతాలలో రూ 109 కోట్ల 85 లక్షలను వానాకాలం పెట్టుబడి సయయం నగదును బుధవారం వరకు జమ చేసిందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 1.42, 386 మంది రైతులకు రూ. 264 కోట్ల 30 లక్షల పెట్టుబడి సహాయం అందించాల్సి ఉందని పేర్కొన్నారు. బుధవారం వరకు నాలుగు ఎకరాల లోపు ఉన్న 95,975 మంది రైతులకు పెట్టుబడి సాయం అందిందని, త్వరలోనే మిగతా వారికి అందనుందని కలెక్టర్ తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ సుభాష్ పాటిల్, అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు



వ్యయ నియంత్రణ చర్యలకు బహుమతి

ఎంపిక చేసిన ఐసీఎంఏఐ



మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం

శ్రీరాంపూర్/మందమర్రిటౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో వ్యయాన్ని నియంత్రించే చర్యలకు భారీ పరిశ్రమల విభాగంలో సంస్థకు జాతీయస్థాయి గుర్తింపు లభించింది. ఐసీఎంఏఐ ఆధ్వర్యంలో మూడో బహుమతికి ఎంపిక కాగా, ఈ నెల 23న ఢిల్లీలో ప్రదానం చేయనున్నారు. సంస్థకు బహుమతి రావడంపై సింగరేణి సీఎండీ ఎన్ బలరాం హర్షం వ్యక్తం చేశారు. 2024 సంవత్సరానికిగాను "నేషనల్ అవార్డు ఫర్ ఎక్సలెన్స్ ఇన్ కాస్ట్ మేనేజ్‌మెంట్"లో భాగంగా సింగరేణికి తృతీయ బహుమతి ఇవ్వనున్నట్లు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఎంఏఐ) అధ్యక్షుడు సీఎంఏ బిభూతి భూషన్ నాయక్ తెలిపారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, నేషనల్ కంపెనీ లాఅ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఛైర్‌పర్సన్ జస్టిస్ ఎస్.జె. ముఖోపాధ్యాయ నేతృత్వంలో న్యాయనిర్ణేతల బృందం భారీ పరిశ్రమల విభాగంలో సింగరేణిని ఎంపిక చేసిందన్నారు. ప్రభుత్వ సంస్థల్లోని మెగా పరిశ్రమల విభాగంలో సింగరేణి బహుమతికి ఎంపిక కావడం సంతోషంగా ఉందని సీఎండీ తెలిపారు.

యోగా సాధన చేసిన ఉద్యోగులు

శ్రీరాంపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో బుధవారం అధికారులు, ఉద్యోగులు యోగా సాధన చేశారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) ఎస్. అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా చేయాలన్నారు. నిత్యం అరగంట పాటు యోగా చేయడంతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయన్నారు. ఉద్యోగులు తప్పనిసరిగా రోజూ కొంత సమయం యోగా చేసేందుకు కేటాయించాలని చెప్పారు. వ్యాధుల బారన పడకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్ట్రాటా కంట్రోల్ అధికారి అమర్‌నాథ్ రెడ్డి, సీనియర్ పీవో కాంతారావు, యోగా గురూజీ సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పీఎఫ్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలకు చెందిన ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్ సమస్యలపై బుధవారం జీఎం కార్యాలయంలో సీఎంపీఎఫ్ జాయింట్ వర్క్‌షాప్ ఏర్పాటు చేశారు. దీనికి సీఎంపీఎఫ్ గోదావరిఖని రీజినల్ కమిషనర్ హరి పచౌరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ పెన్షన్ చెల్లింపు, పెన్షన్ సెటిల్‌మెంట్, పెన్షన్ సవరణ, ప్రావిడెంట్ ఫండ్, తదితర సమస్యలను పరిష్క రించాలన్నారు. సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం ఎన్. సత్యనారా యణ, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్స, డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్, డిప్యూటీ పర్సనల్ మేనే జర్లు దేవేందర్‌రెడ్డి, ఆసిఫ్, సీనియర్ పీవోలు కాంతారావు, ప్రశాంత్, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలకు చెందిన సంక్షేమాధికారులు, క్లరికల్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్, పాల్గొన్న అధికారులు

కారుణ్య నియామకపత్రాలు అందజేత

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): జీఎం కార్యాలయంలో 25 మంది యువతీ, యువకులకు బుధవారం జీఎం ఎం శ్రీనివాస్ కారణ్య నియామకపత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ, దక్షిణ భారతదేశంలో సింగరేణి సంస్థ ఉద్యోగ కల్పనలో ముందంజలో ఉందన్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు క్రమశిక్షణతో నైపుణ్యం పెంపొందించుకొని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని సూచించారు. ఇప్పటివరకు శ్రీరాంపూర్ ఏరియాలో 3,846 కారుణ్య నియామకాలు చేపట్టినట్లు జీఎం తెలిపారు. కార్యక్ర మంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, సీనియర్ పీవో కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న సంక్షేమాధికారికి సన్మానం

శ్రీరాంపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఓసీపీలో సంక్షేమాధికారిగా పనిచేసి మందమర్రి ఏరియాకు బదిలీపై వెళ్తున్న శంకర్‌ను టీబీజీకేఎస్ నాయకులు బుధవారం సన్మానించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేష్, పిట్ కార్యదర్శి గడ్డం సుధాకర్, నాయకులు సారన్న, నిఖిల్ కుమార్, జంగ రమేష్, రామగిరి సంపత్ కుమార్, బుర్ర శ్రీనివాస్, రాజ్‌కుమార్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో సంక్షేమాధికారిగా పనిచేసి మందమర్రి ఏరియాకు బదిలీపై వెళ్తున్న శంకర్‌ను ఏఐటీయూసీ నాయకులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి చంద్రమోహన్, జీఎం చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య, పిట్ కార్యదర్శి మోతె లచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

డీజీఎం సేవలు అభినందనీయం

శ్రీరాంపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : డీజీఎం సేవలు అభినందనీయమని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అన్నారు. శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం(పర్సనల్)గా వచ్చిన ఎస్. సునిల్ కుమార్‌ను ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కేంద్ర నాయకులు గరిగె స్వామి, తిరుపతి రాజు, ఏనుగు రవీందర్ రెడ్డి, జీవన్ జోయల్, మారేపల్లి బాబు, మెండె వెంకటి తదితరులు పాల్గొన్నారు.

రూ. 40వేల కోట్ల బకాయిలు చెల్లించాలి

మందమర్రిటౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి సంస్థకు ప్రభుత్వం బకాయి పడ్డ 40 వేల కోట్ల రూపాయలను చెల్లించాలని, లేకుంటే సంస్థకు భవిష్యత్ ఉండదని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కేంద్ర కమిటీ నాయకుడు పార్వతి రాజిరెడ్డి అన్నారు. హెచ్ఎంఎస్ కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణి సంస్థకు ఈ బకాయిలు శరాఘాతకంగా మారాయన్నారు. డబ్బులు లేకపోవడం వల్ల నూతన గనులు రావడం లేదని, కార్మికుల సంఖ్య తగ్గుతుందని చెప్పారు. విద్యుత్ సంస్థల నుంచి రావాల్సిన డబ్బులు చెల్లించడంలో జాప్యం ఎందుకన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో సంస్థ ఆగమైతే కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా పెద్దగా మార్పులు ఏమి లేవన్నారు. సింగరేణిలో మెడికల్ కాలేజీ నిర్మాణానికి రూ. 500 కోట్లు సింగరేణి మంజూరు చేయడం సరికాదన్నారు. సీఎస్ఆర్ నిధులు, డీఎంఎఫ్‌టీ నిధులను సింగరేణికి సంబంధం లేని చోట్ల వాడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యేలు నిధులను వారి సొంత నియోజకవర్గాల్లో వాడుకుంటున్నారని తెలిపారు. సింగరేణిలో విజిలెన్స్ వేధింపులు పెరిగిపోతున్నాయని, కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రామస్వామి, గట్టయ్య, సంపత్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న హెచ్ఎంఎస్ నాయకులు


మరమ్మతుకు నోచుకోని మత్తడివాగు కుడి తూము

చెరువులు ఇలా.. సాగు నీరు ఎలా?

- పేరుకుపోయిన పూడిక
- మరమ్మతుకు నోచుకోని తూములు
- పిచ్చిమొక్కలతో నిండిన కాలువలు
- పట్టించుకోని అధికారులు

నెన్నెల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి చెరువుల తూములు, కాలువల నిర్వహణ లేక ఆయకట్టు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ప్రధానమైన మత్తడివాగు, కుమ్మరి వాగు, బొక్కలవాగు జలాశయాల్లో నీరు నిలువని పరిస్థితి ఉంది. పూడిక పేరుకుపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. తూములకు షెట్టర్లు పాడై చెరువుల్లో నీరు నిలవడం లేదు. రెండేసి పంటలకు సాగు నీరందించాల్సి ఉండగా, ఒక పంట సీజన్‌కు కూడా పూర్తిగా నీరు సరిపోవడం లేదు. చెత్తా చెదారం, తుంగ, పిచ్చిమొక్కలతో కాలువలు నిండిపోయాయి. దీంతో చివరి ఆయకట్టుకు నీరందక రైతులు ఇక్కట్లపాలవుతున్నారు. రైతులు ఇబ్బందుల పాలవుతుంటే సంబంధితశాఖ అధికారులు మాత్రం చెరువుల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

మరమ్మతుకు నోచుకోని బొక్కలవాగు తూము..

నందులపల్లిలోని బొక్కలవాగు కింద 1200 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువు కుడి తూము మూడేళ్లుగా మరమ్మతుకు నోచుకోవడం లేదు. తూముకు షెట్టర్ మొత్తానికే లేకపోగా, లిఫ్టింగ్ రాడ్ మాత్రమే ఉంది. వర్షాకాలంలో రైతులు తూము లోపల ఇసుక బస్తాలు వేసి నీటిని ఆపుకుంటున్నారు. అవసరమైనప్పుడు బస్తాలు తీస్తున్నారు. చెరువులో నీరు నిండిన తరువాత ఇసుకబస్తాలు వేయడం సాధ్యం కావడం లేదు. దీంతో చెరువులో నీరంతా వృథాగా పోతోంది. గత సంవత్సరం ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ తూము మరమ్మతు చేయలేదని రైతులు పేర్కొన్నారు. కాలువలు మొత్తం పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. దీంతో చివరి ఆయకట్టు వరకు నీరు చేరడం లేదు. సత్వరం పనులు చేపడితే ఈఏడు సాగు నీటి బాధలు తప్పుతాయని రైతులు తెలిపారు.


పిచ్చిమొక్కలతో నిండిపోయిన కుమ్మరివాగు చెరువు ఎడమ కాలువ

మత్తడివాగులో పేరుకుపోయిన పూడిక..

మత్తడివాగు చెరువు జోగాపూర్, గొల్లపల్లి, ఘైలారం గ్రామాల రైతులకు సాగునీరు అందిస్తోంది. దాదాపు రెండు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. పూడిక పేరుకు పోవడంతో కుడి కాలువకు పూర్తి స్థాయి నీరు అందడం లేదు. ఈ కాలువ కింద 350 ఎకరాల ఆయకట్టు ఉంది. తూము షెట్టర్ చిలుముతో పూర్తిగా శిథిలమైంది. దీం తో నీరంతా వృథాగా పోతోంది. గత వానాకాలం సీజన్‌లో నీరందక పొలాలు ఎండిపోయాయి. నీరు లేకపోవడంతో యాసంగిలో గొల్లపల్లి రైతులు పొలాలను బీళ్లుగా వదులుకున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు తెలిపారు. దీంతో వానాకాలం పంటపై అనిశ్చితి నెలకొంది. ఇప్పటి కైనా తూము మరమ్మతు చేయకపోతే ఈ ఏడు సాగు నీరందడం కష్టమని రైతులు వాపోతున్నారు.

మొరాయిస్తున్న కుమ్మరివాగు తూములు..

మండల కేంద్రంలోని కుమ్మరివాగు చెరువులో పూడిక పేరుకపోయింది. దాదాపు 1500 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువు తూముల నిర్వహణ సరిగా లేక మొరాయిస్తున్నాయి. మత్తడి శిథిలావస్థకు చేరింది. కిందిభాగంలో పగుళ్లు తేలి కుంగిపోయింది. కాలువలో పెద్దపెద్ద ఈత చెట్లు తుంగ మొలిచి నీరురావడం లేదు. ప్రతీ సంవత్సరం రైతులు సొంత ఖర్చులతో కాలువలను శుభ్రం చేయించుకుంటున్నారు. వెయ్యి ఎకరాల ఆయకట్టున్న పెద్దచెరువుకు ఇదే కుమ్మరివాగు చెరువు ఫీడర్ చానల్ ద్వారానే నీరు చేరుతుంది. కాని ఫీడర్ చానల్‌కు గండ్లు పడి పెద్ద చెరువుకు నీరు చేరడం లేదు.


దెబ్బతిన్న కుమ్మరివాగు చెరువు మత్తడి

సత్వరం తూము మరమ్మతు చేయాలి

ఇందూరి రమేష్, గొల్లపల్లి



మత్తడివాగు చెరువు కుడి కాలువ తూము పూర్తిగా చెడిపోయింది. ఈ యేడు యాసంగిలో కాలువ కింది పొలా లన్నీ పంట వేయకుండా బీళ్లుగా వది లేసు కున్నాం. షెట్టర్ చిలుము వచ్చి పాడై పోయింది. తూము వద్ద పూడిక చేరడం తో నీరు రావడంలేదు. చెరువు మధ్య నుంచి తూము వరకు కాలువలా తీసి నీరు రప్పించాల్సి వస్తోంది. అధికా రులకు ఎన్నిసార్లు చెప్పినా సమస్య పరి ష్కరించడం లేదు. ఇప్పటికైనా పూడిక తీసి, తూము రిపేరు చేయాలి. లేకపోతే వానాకాలంలో కూడా ఆయకట్టుకు సాగునీరు అందదు.


బొక్కలవాగు చెరువు తూములో షట్టర్ నుంచి విడిపోయిన లిఫ్టింగ్ రాడ్

అన్నదాతల్లో ఆనందం

(5వ పేజీ తరువాయి..)

అవసరం ఉంటుందని భావిస్తున్నారు.

- బెల్లంపల్లి మండలంలో 6,165 మందిని ఎంపి క చేయగా రూ.7కోట్ల 53లక్షల ఏడు వేల 978 నగదు అవసరం కాగా ఇప్పటి వరకు 3,786 మందికి రూ. 2 కోట్ల 93లక్షల 48వేల 568 నగదు బ్యాంకుల్లో జమ చేశారు.
- కాసిపేట మండలంలో 5,668 మంది రైతు లను ఎంపిక చేయగా ఇప్పటి వరకు 3,701 మందికి.. మూడుకోట్ల 10 లక్షల 35వేల 375 రూపాయలు జమ చేశారు.
- తాండూరు మండలంలో 8,407 మందికి గాను 5,120 మందికి నాలుగు కోట్ల 29 లక్షల 63వేల 607 రూపాయలు జమ చేశారు.
- భీమిని మండలంలో 8,013 మందికి గాను 4,337 మందికి.. నాలుగు కోట్ల ఒక లక్షా రెండు వేల 43 రూపాయలు చెల్లించారు.
- కన్నెపల్లి మండలంలో 8,928 మందికి గాను 5,363 మందికి నాలుగు కోట్ల 60 లక్షల 26వేల 772 రూపాయలు జమచేశారు.
- నెన్నెల మండలంలో 9,109 మందికి గాను 6,263 మందికి ఐదు కోట్ల 66వేల 701 రూపాయలు చెల్లించారు.
- వేమనపల్లి మండలంలో 7,297 మందికిగాను 5,505 మందికి నాలుగు కోట్ల 31 లక్షల 84వేల 963 రూపాయలు జమ చేసింది.
- భీమారం మండలంలో 5583 మందికిగాను 3578 మందికి రెండు కోట్ల 81 లక్షల 89వేల 849 రూపాయలు చెల్లించారు.
- చెన్నూరు మండలంలో 16,203 మందికి గాను 10,737 మందికి చెల్లించిన నగదు ఎనిమిది కోట్ల 66 లక్షల 26వేల 156 రూపాయలు.
- జైపూర్ మండలంలో 16,336 మందికి గాను 8888 మందికి ఐదు 5 కోట్ల 88 లక్షల 10వేల 615 రూపాయలు జమ చేశారు.
- కోటపల్లి మండలంలో 13,396 మందికి గానూ 9244 మందికి అందిచిన నగదు ఏడు కోట్ల 78 లక్షల 22 వేల 593 రూపాయలు.
- మందమర్రి మండలంలో 6,822 మందికిగాను 4,194 మందికి మూడు కోట్ల 17 లక్షల 94వేల 201 రూపాయలు చెల్లించారు.
- దండేపల్లి మండలంలో 17,375 మందికిగాను 12,958 మందికి తొమ్మిది కోట్ల 21 లక్షల 61వేల 282 రూపాయలు జమ చేసింది.
- హాజీపూర్ మండలంలో 9,839 మందికిగాను 6,638 మందికి జమ చేసిన నగదు నాలుగు కోట్ల 64 లక్షల, 47వేల 794 రూపాయలు.
- జన్నారం మండలంలో 15,495 మందికిగాను 12,129 మందికి ఎనిమిది కోట్ల 40 లక్షల 8వేల 782 రూపాయలు చెల్లించారు.
- లక్సెట్టిపేట మండలంలో 14,239 మందికి గాను 10,399 మందికి అందిన నగదు ఏడు కోట్ల 21 లక్షల 61వేల 968 రూపాయలు.
- మంచిర్యాల మండలంలో 1369 మందికిగాను 546 మందికి రూ. 35 లక్షల 13వేల 958
- నస్పూర్ మండలంలో 1063 మందికిగాను 500 మందికి రూ. 35 లక్షల 84వేల, 911 నగదును ఇప్పటి వరకు ప్రభుత్వం బ్యాంకుల్లో జమ చేసింది.

ఇద్దరి బైండోవర్

లక్సెట్టిపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి సమస్య లేకున్న డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల విధులను ఆటంకం కల్పిస్తున్న ఇద్దరు పోకిరీలకు లక్సెట్టిపేట పోలీసులు బైండోవర్ చేశారు. మండలంలోని పాత కొమ్ముగూడెం గ్రామానికి చెందిన కారుకూరి మల్లేష్, ధనిశెట్టి సతీష్ అనే ఇద్దరు నిందితులు ఎలాంటి సమస్య లేనప్పటికి నిత్యం డయల్ 100కు ఫోన్ చేసి సమస్య ఉందని చెప్పేవారు. పోలీసులు వచ్చే సరికి అక్కడ ఎలాంటి సమస్య లేకపోవడం అదే విధంగా 100కు ఫోన్ చేసిన వ్యక్తులు కూడా అక్కడ ఉండకపోవడంతో పాటు వాళ్ల ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండేది. ఇలా చాలా సార్లు నిందితులు 100కు ఫోన్ చేయడంతో పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టి కారుకూరి మల్లేష్, ధనిశెట్టి సతీష్ డయల్ 100ను దుర్వినియోగం చేస్తున్నారన్న అభియోగంతో అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ దిలీప్‌కుమార్ ఎదుట బుధవారం బైండోవర్ చేశారు. ఎవరైనా డయల్ 100కు అవసరానికి కాకుండా అనవసరంగా కాల్ చేసి పోలీసు విధులకు ఆటంకం కల్పిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై సురేష్ హెచ్చరించారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు

మందమర్రిటౌన్/మంచిర్యాల రూరల్/చెన్నూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామిని బుధవారం మందమర్రి కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టగా నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు దుర్గం రమేష్, రావికంటి వెంకటేశం, గుడ్ల రమేష్, పైడిమల్ల నర్సింగ్, ఇసాక్, జావేద్‌ఖాన్, మంద తిరుమల్ తదితరులు పాల్గొన్నారు. మంచిర్యాల అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి సదానందం, జిల్లా కుర్మ సంఘం అధ్యక్షుడు కుంట శ్రీశైలం, చెన్నూర్‌కు చెందిన మోహన్‌రెడ్డి, రామన్నతదితరులు మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

హాజీపూర్,జూన్18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నంనూర్, గుడిపేటలో బుధవారం కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. భూమి పూజ చేసుకోవాలని నిర్మాణ పనులకు అనుగుణంగా బిల్లులు మంజూరవుతాయని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ఒడ్డే శ్రీనివాస్, వార్డు ఆఫీసర్ మల్లేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నారిశెట్టి సంతోష్, అక్కె శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల కన్వీనర్ ఆడెపు రమేశ్, కారుకూరి తిరుపతి, వెంకటేశ్‌లు పాల్గొన్నారు.

బకాయి బిల్లులు రాక సర్కార్ బడికి తాళం



పాఠశాల గేటుకు వేస్తున్న తిరుపతి, స్కూలు బయట వేచిచూస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

దండేపల్లి జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన మనఊరు మనబడి, ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం వెల్గనూర్ ఎస్ఎంసీ కమిటీ మాజీ చైర్‌పర్సన్ గడికొప్పుల విజయ-తిరుపతి దంపతులు సర్కార్ బడికి తాళం వేసి పురుగుల మందు డబ్బాతో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఉదయం స్కూల్‌కు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు బయటే నిలబడి ఉండిపోయారు. వెల్గనూర్ గ్రామానికి చెందిన గడికోప్పుల విజయ స్థానిక ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్‌పర్సన్‌గా ఉన్న కాలంలో మన ఊరు మనబడి, ఈజీఎస్ పథకం ద్వారా వెల్గనూర్ ఉన్నత పాఠశాలలో డైనింగ్‌హాల్, టాయిలెట్స్, వాటర్ సంపు, విద్యుత్ మరమ్మతు పనులు, ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. దీని కోసం సుమారు 28 లక్షల వరకు ఖర్చు చేశారు. కేవలం ఐదు లక్షల రూపాయల బిల్లు మాత్రమే వచ్చిందని, ఇంకా 23లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తీసుకు వచ్చి పనులు చేశామని, డబ్బులు ఇవ్వకపోవడంతో వడ్డీ పెరిగి పోతుందని వారు వాపోయారు. బిల్లుల కోసం ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా వారు పట్టించుకోపోవడం లేదన్నారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులకు బిల్లులు రాలేదని కాంగ్రెస్ నాయకులు.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందని బీఆర్ఎస్ నాయకులు అనడంతో గొడవ జరిగింది. పోలీసులు రంగప్రవేశం చేసి నాయకులను చెదరగొట్టారు. అనంతరం ఎస్సై తహసీనోద్దీన్ పోలీసు సిబ్బందితో అక్కడి చేరుకొని విజయ, తిరుపతి దంపతులకు నచ్చజెప్పారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోతామని, న్యాయం చేస్తామని బాధితులకు హామీ ఇవ్వడంతో పాఠశాల గేటు తాళం తీశారు.

● బిల్లులు రాకపోతే చావే శరణ్యం..

- ఎస్ఎంసీ మాజీ చైర్‌పర్సన్ గడికొప్పుల విజయ

వెల్గనూర్ పాఠశాల ఎస్ఎంసీ చైర్‌పర్సన్‌గా ఉన్న సమయంలో పాఠశాలలో రూ. 28లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టాము. కేవలం ఐదు లక్షల బిల్లులు వచ్చాయి. మిగితా 23 లక్షల రూపాయల బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. అప్పులు తీసుకువచ్చి పాఠశాలలో అభివృద్ధి పనులు చేశాము. జిల్లా ఉన్నతాధికారులతో సహా మండలస్థాయి అధికారులను కలిసినా సమస్య పరిష్కారం కాలేదు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోతే మాకు చావే శరణ్యం.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



దరఖాస్తులను పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ మాధవి

దండేపల్లి జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని తహసీల్దార్ రోహిత్ దేశపాండే తెలిపారు. దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్, కొండాపూర్‌లో రెవెన్యూ సదస్సులను బుధవారం నిర్వహించి భూ సమస్యల పరిష్కారానికి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల భూ సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. నెల్కివెంకటాపూర్‌లో 44, కొండాపూర్‌లో 44 మంది రైతుల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవి, సీనియర్ అసిస్టెంట్ లావణ్య, ఆర్ఐ భూమన్న, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కార్మికుల పిల్లలకు బస్సు ఏర్పాటు చేయాలి

మందమర్రిటౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణపూర్ నుంచి మంచిర్యాలలోని పాఠశాలల్లో చదువుకుంటున్న కార్మికుల పిల్లలకు బస్సు సౌకర్యం కల్పించాలని సీఐటీయూ నాయకులు ఏరియా జీఎం దేవేందర్‌కు బుధవారం వినతి పత్రం అందించారు. గోదావరిఖని, ఎస్టీపీపీల్లో బస్సు ఏర్పాటు చేసిన సింగరేణి యాజమాన్యం మందమర్రి ఏరియాలో ఎందుకు విస్మరిస్తుందో అర్థం కావడం లేదన్నారు. కార్మికుల పిల్లలకు బస్సు ఏర్పాటు చేస్తే విద్యార్థులు పాఠశాలలకు సకాలంలో చేరుకుంటారన్నారు. స్కూల్ యాజమాన్యాలు పాఠశాలల బస్సులకు అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, దీంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే బస్సును ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు వెంకటస్వామి, తన్వీర్ హుస్సేన్, షఫీయొద్దీన్‌లు పాల్గొన్నారు.


జీఎంకు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

కాంగ్రెస్ నాయకుల సంబరాలు


సంబరాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

లక్సెట్టిపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల పెట్టుబడి సాయం కోసం రైతు భరోసా నిధులను విడుదల చేయడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం సంబరాలు జరుపుకున్నారు. స్థానిక ఐబీలో నాయకులు బాణాసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ ఆరీఫ్, మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు పూర్ణచందర్‌రావు, చింత అశోక్, యూత్ అధ్యక్షుడు రాందేని చిన్నవెంకటేష్, బొప్పు సుమన్, నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభను విజయవంతం చేయండి

నస్పూర్/మందమర్రిటౌన్ జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా మహాసభలు ఈనెల 21, 22 తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ కోరారు. నస్పూర్ పట్టణంలో బుధవారం జిల్లా మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. మందమర్రి సీపీఐ పార్టీ కార్యాలయంలో రామడుగు లక్ష్మణ్ విలేకరులతో మాట్లాడారు. జిల్లా మహాసభలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి తదితరులు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, రాష్ట్ర సమితి సభ్యులు రేగుంట చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కారుకూరి నగేశ్, జిల్లా సమితి సభ్యులు దొడ్డిపెల్లి రవీందర్, పౌలు, నాయకులు పూజారి రామన్న, లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి/బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈనెల 21, 22న ఎం కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిచే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల దాస్, సీపీఐ నాయకులు కోరారు. దండేపల్లి, బెల్లంపల్లిలో సీపీఐ జిల్లా మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు బొల్లం పూర్ణిమ, సీపీఐ దండేపల్లి మండల కార్యదర్శి పెర్క రాజేష్, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి రాజమౌళి, మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

భీమారం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పోలీసులు అక్రమంగా కేసులు పెడుతూ తమను వేధిస్తున్నారని భీమారం ఎస్ఐ శ్వేతపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు బూరుగుపల్లికి చెందిన భుక్య రాజునాయక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా బూరుగుపల్లిలో తమ కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అక్రమ కేసులు పెట్టడమే కాకుండా జాతి పేరుతో దూషించినట్లు తెలిపారు. దీంతో తీవ్రమనస్తాపం చెంది ఈ నెల 3న ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఫిర్యాదు చేయగా స్పందించిన అధికారులు సమగ్ర నివేదిక సమర్పించాలని రామగుండం కమిషనరేట్‌కు లేఖ రాసినట్లు రాజునాయక్ తెలిపారు. ఈ విషయంపై భీమారం ఎస్ఐ శ్వేతను వివరణ కోరగా గతంలో రాజునాయక్‌పై కేసులు ఉండడంతో వీటిని కప్పిపుచ్చుకోవడానికి తనపై ఆరోపణలు చేస్తున్నాడని పేర్కొన్నారు.

'రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ నాయకులు'

బెల్లంపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి పట్టణంతో పాటు నియోజకవర్గంలో రౌడీయిజాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రోత్సహిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆరోపించారు. బుధవారం ఆసుపత్రిలో గాయాలతో చికిత్సపొందుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలను పరామర్శించి మాట్లాడారు. మండలంలో పట్టణంలో కాంగ్రెస్ నాయకులు యథేచ్ఛగా భూకబ్జాలు చేస్తూ ప్రశ్నించిన వారిపై దాడికి పాల్పడడం హేయమైన చర్య అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక బెల్లంపల్లిలో భూకబ్జాలకు సెటిల్‌మెంట్లకు అడ్డాగా మారిందన్నారు.

ప్రశ్నించినవారిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేస్తూ అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడికి సంబంధించిన ఘటనపై సీపీ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు

జన్నారం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ అనూష హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో నడుస్తున్న బస్సులను పరిశీలించారు. బస్సుల్లో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను ఎక్కించుకోవద్దన్నారు. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకొని వస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. ప్రతీ పాఠశాల బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరిగా ఉండాలని, అదే విధంగా డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతి బస్సులో ఫస్టుఎయిడ్ కిట్‌తో పాటు ఫైర్‌సేఫ్టీ కిట్, ఐడీ కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు తప్పనిసరిగా కలిగి ఉండాలని అన్నారు. బస్సు డ్రైవర్లు విద్యార్థులను తీసుకొస్తున్న సమయంలో నిబంధనలు పాటించాలని వాహనాలు నడిపేటప్పుడు ఫోన్‌లో మాట్లాడవద్దన్నారు. ఎలాంటి నిబంధనలు పాటించకున్న యాజమాన్యాలపై, డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు. ఎస్ఐ వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

బెల్లంపల్లి: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని 2టౌన్ ఎస్ఐ మహేందర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

నస్పూర్: ఈ నెల 22న హైదరాబాద్ నుంచి శ్రీశైలం వరకు విశ్వకర్మ యువ బైక్ యాత్ర జరుగుతుందని, ఈ యాత్రను విజయవంతం చేయాలని నస్పూర్ మండల విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘ నాయకులు కోరారు. బుధవారం మండల విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సభ్యుల సమావేశం జరిగింది.

జైపూర్: సింగరేణి ఈఅండ్ఎం అధికారుల బదిలీల్లో భాగంగా రామగుండం 2 ఏరియా ఇంజనీర్‌గా విధులు నిర్వహించి ఎస్టీపీపీకి బదిలీపై వచ్చిన ఏజీఎం (ఈఅండ్ఎం) నర్సింహారావును బుధవారం ఈడీ చిరంజీవి, ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు సన్మానించారు. జీఎం పర్చేస్ కాంట్రాక్ట్స్ అండ్ స్టోర్స్ విభాగాధిపతిగా బాధ్యతలు చేపట్టారు.

జైపూర్: ఎస్టీపీపీలో పది సంవత్సరాల నుంచి పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు.

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాకు బదిలీ అయ్యి బాధ్యతలు చేపట్టిన అధికారులను టీబీజీకేఎస్ నాయకులు బుధవారం సన్మానించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు.

హాజీపూర్: మంచిర్యాల జిల్లా టీఎన్‌జీవోస్ వెటర్నరీ ఫోరం జిల్లా కార్యవర్గం ఎన్నిక బుధవారం గుడిపేటలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలిగా ఎం. విజయ భారతి, సహ అధ్యక్షులుగా ఇందిరా, కార్యదర్శిగా గంగు మల్లు, కోశాధికారిగా సత్యం, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి శంకర్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి పాల్గొన్నారు.

దండేపల్లి: బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎండి శరీఫోద్దీన్ రెబ్బనపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందజేశారు. హెచ్ఎం మంత్రి రాజు అన్నారు.

ఆటో కిందపడి బాలుడి మృతి

బెల్లంపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన రియాన్(6) పాఠశాల ఆటో కింద పడి బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం సుభాష్‌నగర్‌కు చెందిన సంతోష్‌కు కుమార్తె, కుమారుడు రియాన్ ఉన్నారు. బూడిదగడ్డ బస్తీలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. పాఠశాల సమయం ముగిసిన తరువాత ప్రతి రోజులాగేనే పాఠశాల ఆటోలో ఇంటికి బయలు దేరాడు. ఆటో డ్రైవర్ నల్లాల రాజేశ్ సుభాష్‌నగర్ వెంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలో ఆటోను మలుపు తిప్పే సమయంలో ఆటోలో కూర్చున్న రియాన్ ఒక్కసారిగా కిందపడిపోయాడు. అతని పై నుంచి ఆటోటైర్లు వెళ్లడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మరో రెండు నిమిషాల్లో ఇంటికి..

ఆటో ప్రమాదంలో మృతి చెందిన రియాన్ మరో రెండు నిమిషాల్లో ఇంటికి చేరేవాడు. ఆటో డ్రైవర్ అతివేగంతో నిర్లక్ష్యంగా నడపడంతో మృతి చెందిన ఘటన పట్టణంలో కుటుంబసభ్యుల్లో విషాదం నెలకొలిపింది. ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహం వద్ద తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఒక్కగానొక్క కొడుకు పాఠశాల కు పంపిస్తే విగితజీవిగా మారాడని వారు రోదించిన తీరు పలువురుని కంటతడి పెట్టించింది.

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కృషి చేయండి

తాండూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తాండూర్‌లో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కృషి చేయాలని కోరుతూ బుధవారం తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివశరణ్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు పట్టణంలో వినతి పత్రం అందించారు. మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కుమరం భీం
జిల్లా వార్తలు

8 గురువారం 19 జూన్ 2025

విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం

దహెగాం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం ఇట్యాల ప్రాథమిక పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ప్రీ ప్రైమరీ తరగతులను ఎంఈవో శ్రీనివాస్, జిల్లా కో ఆర్డినేటర్ యు.శ్రీనివాస్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యను, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. నూతనంగా చేరిన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు కుర్షిద్ బేగం, వీరశంకర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జీవో 49ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి

లింగాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జీవో 49ని ఉపసంహరించుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు సురేషన్ అన్నారు. మండల కేంద్రంలో మండల నాయకులతో కలిసి బుధవారం తహసీల్దార్ నాగరాజుగౌడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుమరం భీం జిల్లా టైగర్ కన్జర్వేషన్ రిజర్వు జీవోను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. దీని వల్ల ఆదివాసీలకు నష్టం కలుగుతుందని చెప్పారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవలని కోరారు. స్పందించకుంటే ఆందోళనలు చేపడుతామని వారు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు హిరామన్, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

- రక్తహీనత సమస్య నివారణకు ప్రభుత్వం చర్యలు
- పైలట్ ప్రాజెక్ట్ కింద జిల్లా గుర్తింపు
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాలతో కూడిన చిక్కీల పంపిణీ

కౌమార బాలికలకు 'ఇందిరమ్మ అమృతం'



ఆసిఫాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కౌమారదశ లోని బాలికల్లో రక్తహీనత నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకా నికి శ్రీకారం చుట్టింది. ఆడ పిల్లలకు శక్తి నిద్దాం... ఆరోగ్య తెలంగాణను నిర్మిద్దాం అనే నినాదంతో బాలికలకు పోషకాహారం అందించేలా ఇందిరమ్మ అమృతం పథకాన్ని రూపొందించింది. రాష్ట్రంలోని 14 నుంచి 18 ఎళ్ల వయస్సు గల కౌమార దశ బాలికలు పౌష్టికాహర లోపంతో రక్తహీనతకు గురవుతున్నారని గుర్తించి పోషకాలతో కూడిన చిక్కీలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేయనుంది. బాలికలలో అత్య ధికంగా రక్తహీనత కలిగి ఉన్న భద్రాద్రి కొత్త గూడెం, జయశంకర్ భూపాలపల్లి, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలను పైలట్ ప్రాజె క్ట్‌గా తీసుకుని పథకాన్ని ప్రయోగాత్మకంగా మే 29న ప్రారంభించారు. రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు ప్రభుత్వం జిల్లా అధికార యంత్రాంగానికి విధివిధానాలను అప్పగించింది.

● జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం..

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే- 5 ప్రకారం తెలంగాణలో 64.7శాతం బాలికలు రక్తహీ నతతో బాధపడుతున్నారు. దీన్ని నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ సర్వే ప్రకారం రక్తహీనత అత్యధికంగా నమోదైన మూడు జిల్లాల్లో ఈ పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు కుమరం భీం జిల్లాలోని ఐదు ఐసీడీఎస్ కేంద్రాల పరిధిలో మొత్తం 18,230 మంది కౌమరదశ బాలికలు ఉన్నట్లు అధికా రులు గుర్తించారు. ఈ పథకం ద్వారా వీరందరికి పోష కాలతో కూడిన చిక్కీలు అందించనుంది. ఇందిరమ్మ అమృతం పథకంలో భాగంగా కౌమర బాలికల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పోషకాహారం కింద పల్లీలు, చిరుధాన్యాలతో తయారు చేసిన చిక్కీలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలికలకు ఉచితంగా పంపిణీ చేస్తారు. రోజుకు ఒకటి చొప్పున నెలకు 30 చిక్కీలు నెలలో రెండుసార్లు పంపిణీ చేస్తారు. ఈ చిక్కిలో సుమారు 600 కేలరీలు, 18 నుంచి 20 గ్రాముల ప్రొటీన్లతో పాటు అవసరమైన సూక్ష్మ పోషకాలు ఉంటాయి.

● జిల్లా వ్యాప్తంగా ఇలా..

జిల్లాలోని 15 మండలాల్లో మొత్తం 973 అంగన్‌వాడీ కేంద్రాలలో 18,230 మంది కౌమరదశ బాలికలు ఉన్నట్లు గుర్తించారు. ఆసిఫాబాద్ మండలంలో 126 కేంద్రాలలో 2,127 మంది బాలికలు, రెబ్బెనలో 69 కేంద్రాలలో 1,125 మంది, తిర్యాణిలో 65 కేంద్రాలలో 869 మంది, జైనూ రులో 76 కేంద్రాలలో 1,301 మంది, లింగాపూర్‌లో 45 కేంద్రాలలో 654 మంది, సిర్పూర్ (యూ)లో 54 కేంద్రాలలో 681 మంది, కాగజ్‌నగర్‌లో 130 కేంద్రా లలో 3,086 మంది బాలికలు ఉన్నారు. దహెగాంలో 43 కేంద్రాలలో 833 మంది, బెజ్జూర్‌లో 41 కేంద్రాలలో 998 మంది, చింతలమానేపల్లి మండ లంలో 43 కేంద్రాలలో 1080 మంది, పెంచికల్‌పేటలో 52 కేంద్రా లలో 555 మంది, కౌటాలలో 52 కేంద్రాలలో 1240 మంది, సిర్పూర్(టి)లో 45 కేంద్రాలలో 909 మంది, కెరమెరిలో 84 కేంద్రాలలో 1287 మంది, వాంకిడిలో 79 కేంద్రాలలో 1485 మంది కౌమరదశ బాలికలు ఉన్నారు.

కౌమర బాలికలకు అమలు..

- భాస్కర్, జిల్లా సంక్షేమాధికారి

జిల్లాలో 18,230 మంది కౌమర బాలికలకు ఇందిర మ్మ అమృతం పథకాన్ని అమలు చేయనున్నాం. ఈ పథకాన్ని జిల్లాలో ఇటీవల లాంఛనంగా ప్రారంభిం చాం. త్వరలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పోషకాహా ర కిట్లు పంపిణీ చేసి బాలికలకు అందజేస్తాం.

జిల్లా ఇన్‌చార్జి మంత్రికి పుష్పగుచ్ఛం అందజేత



జూపల్లి కృష్ణారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ విఠల్

కాగజ్‌నగర్/ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఇటీవల కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన గడ్డం వివేక్‌ను బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఈ ప్రాంత సమస్యలపై వారితో చర్చించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానానికి తరలిరావాలి

కాగజ్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో 19న నిర్వహించనున్న దివ్యాంగుల ఆత్మబంధువు మందకృష్ణమాదిగకు ఆత్మీయ సన్మానం కార్యక్రమానికి జిల్లా నుంచి దివ్యాంగులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చారిల్లు గుండా థామస్, మంత్రి మల్లేష్ కోరారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బన్నమూర్తి, చైతన్య దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ ఖయ్యూం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు రేగుంట మహేష్, దివ్యాంగులు గోలేం వెంకటేష్, పొన్నాల రమాకాంత్, అబ్దుల్ మాజీద్, జాడి శ్రీను, అంజన్న, గులాబ్, శశికాంత్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసి.. సమస్యలు విన్నవించి..



ముఖ్యమంత్రితో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్

ఆసిఫాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్ మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా నియోజక వర్గంలో నెలకొన్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ సభ్యులు సత్తాచాటాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కడి శివచరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని జిల్లా యూత్ అధ్యక్షుడు గుండా శ్యాం అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.తామస్, రాష్ట్ర ఇన్‌చార్జి ఖలీద్ అహ్మద్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంరద్భంగా నాయకులు, కార్యకర్తల తో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నాయకులు అనీల్‌గౌడ్, చరణ్, సాయి, షేక్ ఖలీమ్, సలీం, జావీద్, కార్తీక్, శైలేందర్ పాల్గొన్నారు.

క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి

వాంకిడి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో క్రీడా మైదానం, గ్రంథాల యానికి పక్కా భవనం, చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేయాలనిబుధవారం జిల్లా కేంద్రానికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డికి మండల నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, దాదజీ, మల్లయ్య, గుండన్న, తిరుపతి, శ్రీను, సోము, సంతోష్, రమేష్, సదాశివ, శ్రీను, సురేష్, చందు, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను బుధవారం పీడీ విద్యాసాగర్, పీడీ రాజయ్య, ఎంఈవో సుభాష్, ప్రధానోపాధ్యాయు రాలు విజయ లక్ష్మి అభినందించారు. ఆసిఫాబాద్ మండలంలోని జడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలకు ఆసిఫాబాద్ ప్రోగ్రెస్ స్కూల్ విద్యార్థి కట్కుర్ సంజన, బూర్గుడ స్ఫూర్తి స్కూల్‌కు చెందిన చౌదరి అనిరుద్‌లు ఎంపికైనట్లు పీడీ విద్యాసాగర్ తెలిపారు. 24న నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తిర్యాణి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ పల్లవి అన్నారు. బుధవారం మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రత్నమాల, శ్రీనివాస్, విజయలక్ష్మి, హేమలత, సాజిదభాను, రమేష్, ల్మి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జోడేఘాట్‌కు బస్సు పునఃప్రారంభం

కెరమెరి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలంలోని జోడేఘాట్‌కు కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'యువతను మోసగిస్తున్న ప్రభుత్వాలు'

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి కల్పించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో సీపీఐ పార్టీ అధ్యక్షుడు చిరంజీవి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన పట్టణ మహాసభలకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారా యణతో కలిసి హాజరయ్యారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నూతన మండల, పట్టణ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యద ర్శిగా సాయి, సహాయ కార్యదర్శిగా వెంకటేష్, పట్టణ కార్యదర్శిగా అజయ్, సహాయ కార్యదర్శిగా మురళీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, డొన్నాజీ, జయరాం, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో బుధవా రం వైద్య సిబ్బందికి మద్యం, పొగాకు వాడడం వల్ల కలిగే అనర్థాలపై డీఎంహెచ్‌వో సీతారాం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 నుంచి 19 సంవత్సరాల కౌమార బాల, బాలికలకు ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ప్రతి గ్రామంలో పొగాకు వాడకం, మద్యం సేవించడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు 23లోగా ధ్రువపత్రాలు అందజేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మోడల్ పాఠశాలలో రెండో జాబితాలో పేర్లు ఉన్న విద్యార్థులు 23వ తేదీలోగా ధ్రువపత్రాలు అందజేయాలని ప్రిన్సిపాల్ మహేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో జాబితాలో ఎంపికైన అభ్యర్థుల జాబితాను పాఠశాలలో అందుబాటులో పెట్టామని తెలిపారు.

గ్రామాల అభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర కీలకం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న అధికారులు

ఆసిఫాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేయూత పింఛన్‌పై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, కార్యదర్శులు, బిల్ కలెక్టర్‌లకు బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సెర్ప్ డైరెక్టర్ గోపాల్‌రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమైందని చెప్పారు. ప్రతి పథకంలో వారిని భాగస్వామ్యం చాలా అవసరమని అన్నారు. పేదవారికి అందిస్తున్న చేయూత పింఛన్ ప్రతి లబ్ధిదారుడికి అందే విధంగా చర్యలు తీసుకోవాలని, చనిపోయిన పింఛన్‌దారుడు స్థానంలో కుటుంబ సభ్యులలో అర్హులైన వారికి మంజూరుపై పరిశీలన జరిపి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. 21 రకాల దివ్యాంగ పరీక్షలు సదరం క్యాంపులలో నిర్ధారిస్తున్నారని అన్నారు. పింఛన్ ఎంపికలో దరఖాస్తుదారుడికి ఆర్థిక పరిస్థితి పరిశీలించాలని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు గిరిజన గ్రామాలలో ప్రధాన మంత్రి జుగా పథకం కింద నిర్వహిస్తున్న శిబిరాలకు పంచాయతీ కార్యదర్శులు హాజరై గిరిజనులకు ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డులు లేని వారిని గుర్తించాలన్నారు. గిరిజనులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి రోగనిర్ధారణ చేసి అవసరమైన మందులు అందించాలని తెలిపారు. అలాగే వనమహోత్సవం, ఇందిరమ్మ ఇంటి నిర్మాణా లు, వర్షాకాలంలో సమస్యలు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలు, డ్రగ్ డే, తదితర విషయాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు సూచనలు చేశారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్-2025 కార్యక్రమం సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జడ్పీసీఈవో లక్ష్మీనారాయణ, గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, కమర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో ఒకరికి పదేళ్ల జైలు శిక్ష

ఆసిఫాబాద్/కౌటాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి అత్యాచారం కేసులో పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.40 వేల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎంవీ రమేశ్ తీర్పు వెలువ రించినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపా రు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాల యంలో బుధవారం ఆయన తెలిపారు. కౌటాల మండ లంలోని ఓ గ్రామానికి చెందిన యువతి(22) కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నది. ఆమె ఇంటి దగ్గరే నివాసం ఉండే నికోడ నరేష్(22) అనే వ్యక్తిగత కొద్ది రోజులుగా ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని వెంటపడుతూ ఉండేవాడు. బాధితురాలు తనకు పెళ్లి సంబంధాలు ఇంట్లో వాళ్లు చూస్తున్నారని తన వెంట పడవద్దని నరేష్‌కు చెప్పింది. 2017 మే 21న చింతలమానేపల్లి మండలానికి చెందిన ఒక వ్యక్తితో ఆ యువతికి వివాహం జరిగిం ది. వివాహం అనంతరం కూడా నరేష్ యువతిని పలుమార్లు వేధింపులకు గురి చేస్తూ ఉండేవాడు.

ఈ సందర్భంగా ఆ యువతికి తన భర్తతో నరేష్ విషయంలో చాలా గొడవలు కొనసాగాయి. 2020 సెప్టెంబరు 25న రాత్రి బహి ర్భూమికి వెళ్లిన యువతిపై నరేష్ అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం భర్తకు తెలియడంతో పలుమార్లు పంచాయితీలు జరిగాయి. అనంతరం ఆ యువతికి భర్తకు విడాకులు ఇచ్చాడు. బాధిత యువతి 2020 అక్టోబరు 16న కౌటాల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అప్పటి ఏఎస్సై శివాజీ కేసు నమోదు చేశారు. అనంతరం సీఐలు బి శ్రీనివాస్, బిస్వామి కేసు దర్యాప్తు చేశారు. పీపీ జగన్మోహన్‌రావు కోర్టులో సాక్షుల ను హాజరు పరిచారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జడ్జి నికోడ నరేష్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ.40 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ప్రస్తుత డీఎస్పీ రామానుజం, కౌటాల సీఐ రమేష్, ఎస్సై విజయ్‌తో పాటు సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.

పార్టీని బలోపేతం చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్ రావు అన్నారు. జిల్లాకేంద్రంలోని బుధ వారం మాజీ ఎంపీపీ మల్లికార్జున్‌తో కలి సి మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. మండలాధ్యక్షుడిగా పెంటు, ఉపాధ్యక్షులుగా లింగు, జగదీష్, పోశన్న, ప్రధాన కార్యదర్శిగా వెంకన్న, ప్రహ్లాద్, మహిళా కార్యదర్శిగా రేవతి, తిరుపతమ్మ, కోశాధికారిగా సంతోష్‌ను ఎన్నుకున్నారు.

పీఎం జుగా పథకంతో

గిరిజన ఆవాసాల అభివృద్ధి

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకు వచ్చిన ప్రధాన మంత్రి జన జాతీయ గ్రామీణ ఉత్కర్ష్ అభియాన్ పథకంతో గిరిజనుల ఆవాసాలు అభివృద్ధి చెందుతాయని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి అన్నారు. ఆసిఫాబాద్ మండలం దడ్పాపూర్‌లో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. జిల్లాలో 102 గిరిజన గ్రామాలను ఎంపికయ్యాయని అన్నారు. ఈ పథకం ద్వారా ఆయా గ్రామాల రూపురేఖలు మారుతాయని తెలిపారు. ఆధార్‌కార్డు, ఆయుష్మాన్, ఆరోగ్య శ్రీ కార్డు, కుల ధృవీకరణ పత్రం, కిసాన్ క్రెడిట్ కార్డు, విద్యుత్, విద్య, తదితర కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, ఎస్‌సీఆర్పీ రవీందర్, ఎస్బీఐ మేనేజర్ అనంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరంజీవాడ గ్రామంలో బుధవారం పీఎంపథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పథకంలో గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం ముఖ్య ఉద్దేశమని ఈ పథకం కింద కరంజీవడ ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. కార్యక్రమంలో ఏటీడీవో శ్రీనివాస్, ఎస్‌సీఆర్పీ నరేష్, కార్యదర్శి వెంకటేశ్వర్, డీటీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి జంజాతి ఉన్నత్ గ్రామ్ అభియా న్(పీఎం జుగా) పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బాబాపూర్, కోయపల్లి గ్రామాల్లో పీఎం జుగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి,(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంభీరావుపేట, ఏదులపాడు గ్రామంలో పీఎం జగా పథకంపై ఎంపీడీవో మల్లేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పథకంలో గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఎస్ఆర్పీ యశ్వంత్‌రావు, వెటర్నరీ డాక్టర్ సాగర్, సీఎఫ్ఎల్ కార్యకర్త శ్రీకాంత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని జండగాగూడలో ఎస్పీఈఆర్పీ చవ్హాన్ రవీందర్ పీఎం జుగా పథకంపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ పథకం అమలు చేయడం ద్వారా ఆదివాసీ, గిరిజన ఆవాసాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కుంర తిరుమల, మాజీ సర్పంచ్ పూసం రాము తదితరులు పాల్గొన్నారు.